క్లుప్తంగా

అభివృద్ధి పనుల ప్రణాళికపై శిక్షణ

పాడేరు రూరల్ (అరకులోయ రూరల్): మండల పరిషత్ కార్యాలయంలో గురు, శుక్రవారాల్లో రెండు రోజుల పాటు గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ తరగతులకు అందరూ విధిగా హాజరుకావాలని కోరారు.

టార్పాలిన్ల పంపిణీ



రైతులకు టార్పాలిన్లను పంపిణీ చేస్తున్న ఏడీఆర్ అప్పలస్వామి, శాస్త్రవేత్తలు

చింతపల్లి: గిరిజన రైతులు పంటల సాగులో శాస్త్రీయ విధానాలు, ప్రకృతి సాగును ఆచరించాలని, దీంతో మంచి దిగుబడులు పొందవచ్చని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. గిరిజన ఉపప్రణాళిక నిధులతో బుధవారం చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల్లోని గిరిజన రైతులకు టార్పాలిన్‌లను పంపిణీ చేశారు. శాస్త్రవేత్తలు డాక్టర్ బాల హుస్సేన్‌రెడ్డి బయ్యపురెడ్డి ,సందీప్‌నాయక్ జోగారావు పాల్గొన్నారు.

పెంచిన కరెంటు చార్జీలను తగ్గించాలి



పోతురాజు

దుంబ్రిగుడ: మద్యం ధరలు తగ్గించడం కాదు పెంచిన కరెంటు చార్జీలు, నిత్యావసర ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్.పోతు రాజు కూటమి ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్‌ల హామీలను అమలుచేయాలని ట్రూ అప్ తదితర అన్ని రకాల అదనపు భారాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు వెంటనే ఉపసంహరించుకోవాలని, ఆదానీతో జరిగిన అన్ని రకాల ఒప్పందాలను రద్దు చేయాలన్నారు. పెంచిన నిత్యావసర ధరలను వెంటనే తగ్గించి, పీటీజీ గురుకుల పాఠశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని పరిష్కరించాలన్నారు. లేని పక్షంలో ప్రజల మద్దతుతో భారీ ఎత్తున ఆందోళన చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాడేరు రూరల్,(అరకులోయ రూరల్): జిల్లాలోని పలు చోట్ల విద్యుత్ లైన్‌ల మరమ్మతులో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ ఎ.వి.ఎస్.ఎం.అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా జిల్లా పరిధిలోని 33/11 కేవీ విద్యుత్ లైన్ బాగుచేస్తు నేపథ్యంలో చింతపల్లి పరిధిలోని వంగసార, కినెర్ల, కొమ్మంగి, కొత్తపాలెం, లోతుగెడ్డ ప్రాంతాలతో పాటు జి.మాడుగుల సబ్ స్టేషన్ కొక్కిరపల్లి ఫీడర్ పరిధిలో కొక్కిరపల్లి, తాలమామిడి, వంజరి, దేవరపల్లి గ్రామాలకు ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

తుపాను పునరావాస కేంద్రం ఏర్పాటుకు చర్యలు



తుపాను పునరావాస కేంద్రానికి స్థలాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రామకృష్ణ

గూడెంకొత్తవీధి: కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో తుపాను పునరావస కేంద్రం ఏర్పాటుకు స్థల సమీకరణ చేసినట్టు తహసీల్దార్ రామకృష్ణ బుధవారం తెలిపారు. సప్పర్ల, గూడెంకొత్తవీధిలో సుమారు నాలుగుకోట్ల వ్యయంతో నిర్మించనున్నట్టు చెప్పారు. గూడెంకొత్తవీధిలోని ఏకలవ్య పాఠశాల సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించినట్టు తెలిపారు. ఈ మేరకు మండల కేంద్రంలో 20 సెంట్ల భూమిని కేటాయిస్తున్నామన్నారు. ఆయన వెంట మండల సర్వేయర్ శ్రీను, వీఆర్వో లింగాలు తదితరులున్నారు.

వారధి.. హతవిధి



అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెన నిర్మాణం

- అసంపూర్తిగా వంతెన నిర్మాణం
- గ్రామస్తులకు తప్పని అవస్థలు
- పట్టించుకోని అధికారులు

చింతూరు: ఆయా గ్రామస్తులు ఇతర ప్రాంతాలకు వెళ్లాలంటే ఇక్కట్లే...వాగుపై ఉన్న వంతెన అసంపూర్తిగా ఉండడంతో రాకపోకలకుగ్రామస్తులకు అవస్థలు తప్పడం లేదు. ఏళ్లు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో వారి పరిస్థితి దయనీయంగా మారింది.. ఇది చింతూరు మండలం మండలంలోని వెంకట్రామాపురం, ఆముదాలపాడు గ్రామాల మధ్య అసంపూర్తిగా ఉన్న వంతెనతో స్థానికుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి.

కాలినడకన ఆరు కిలోమీటర్లు

తమ గ్రామాలకు వెళ్లేందుకు అడ్డుగా ఉన్న వాగుపై ప్రారంభించిన వంతెన నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయిందని, దీనిని త్వరితగతిన పూర్తి చేయాలని మండలంలోని వెంకట్రామాపురం, ఆముదాలపాడు గ్రామాల గిరిజనులు కోరుతున్నారు. లచ్చిగూడెం పంచాయతీలోని ఆయా రెండు గ్రామాలతో



వంతెనకు అనుసంధానంగా నిర్మించిన రహదారి

పాటు సరిహద్దుల్లోని ఛత్తీస్‌గఢ్‌కు సంబంధించిన పాలకిట్ట, బట్టేరు గ్రామాలకు వెళ్లేందుకు మధ్యలో ఉన్న పెద్దవాగు దాటాల్సిందే. ఆయా గ్రామాల గిరిజనులు పనుల నిమిత్తం చింతూరు లేదా భద్రాచలం వెళ్లాలంటే కాలినడకన ఆరు కిలోమీటర్ల దూరంలోని సరివెల వచ్చి అక్కడి నుంచి ఆటోలు, బస్సుల్లో వెళ్లాల్సిన పరిస్థితి. మధ్యలో వాగు అడ్డంకిగా ఉండడంతో ఆ గ్రామాలకు వాహనాలు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో అత్యవసర పరిస్థితులు వచ్చినా కాలినడకనే వాగు దాటి ప్రధాన రహదారి వరకు రావాలి.



రేషన్ కోసం కాలినడకన వెళ్తున్న వెంకటరామపురం మహిళలు

మావోయిస్టుల దుశ్చర్యలతో పనులకు ఆటంకం

గ్రామస్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ప్రధానమంత్రి గ్రామీణ సడక్‌యోజన పథకం కింద రూ 2.17 కోట్లతో వాగుపై వంతెన మంజూరై పనులు కూడా ప్రారంభమయ్యాయి. యాభైశాతం పనులు పూర్తయిన తరుణంలో ఆ ప్రదేశంలో పనులు చేస్తున్న వాహనాలను 2020 జూన్‌లో మావోయిస్టులు దగ్ధం చేశారు. దీంతో అప్పటి నుంచి వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. మరోవైపు వంతెనకు అనుసంధానంగా ఆర్‌అండ్‌బీ రహదారి నుంచి వెంకట్రామాపురం వరకు ఐదు కిలోమీటర్ల మేర రూ.60 లక్షలతో చేపట్టిన బీటీ రహదారి నిర్మాణం కూడా ఇరువైపులా పూర్తయింది. వంతెన నిర్మాణంతో తమ కాలినడక కష్టాలు తీరుతాయని ఆశించిన ఆయా గ్రామాల గిరిజనులు వంతెన నిర్మాణం నిలిచిపోవడంతో నిరాశ చెందుతున్నారు. అధికారులు స్పందించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలని వారు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



రహదారి సరిగా లేకపోవడంతో మా గ్రామాలకు ఎలాంటి వాహనాలు రావడంలేదు. దీంతో సరివెల వరకు కాలినడకనే ప్రయాణిస్తూ ఇబ్బందులు పడుతున్నాం. రేషన్ తెచ్చుకునేందుకు తుమ్మల వెళ్లాలన్నా కాలినడక తప్పడంలేదు. వర్షాలు కురిసినపుడు పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది.

– వెట్టి సీతమ్మ, వెంకట్రామాపురం

వర్షాకాలంలో అవస్థలే



వర్షాకాలంలో వాగు ఉధృతంగా ఉండి దాటలేని పరిస్థితి ఉంటుంది. అత్యవసర పరిస్థితుల్లో కూడా వైద్యం అందక ప్రాణాపాయ పరిస్థితులు నెలకొంటున్నాయి. గ్రామాలకు వేరే ప్రాంతాల నుంచి సంబంధాలు ఉండవు. వాగు ఉధృతి తగ్గేవరకు తిప్పలు తప్పవు. ఉన్నతాధికారులు స్పందించి వంతెన నిర్మాణం పూర్తి చేయాలి.

– కుంజా అప్పారావు, వెంకట్రామాపురం

త్వరలో టెండర్ల ప్రక్రియ

గతంలో మావోయిస్టుల చర్య కారణంగా వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే తిరిగి టెండర్లు పిలవడం జరుగుతుంది. ఉన్నతాధికారుల సూచనల మేరకు టెండర్ల ప్రక్రియ పూర్తికాగానే వంతెన నిర్మాణ పనులు ప్రారంభిస్తాం.

– ఆచారి, ఏఈ, పీఐయూ శాఖ

ఆర్‌వో వాటర్ ప్లాంట్ల ఏర్పాటుకు చర్యలు



పాడిలో స్థానికులతో మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్, ఎంపీడీవో ప్రసాద్

కొయ్యూరు: మండలంలోని కొండగొరికి పంచాయతీ పాడి గ్రామాన్ని ఎంపీపీ బడుగు రమేష్, ఎంపీడీవో ప్రసాద్‌లు బుధవారం సందర్శించారు. గ్రామంలో కిడ్నీ వ్యాధిగ్రస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు గ్రామాన్ని సందర్శించినట్టు వారు చెప్పారు. అనంతరం గదబపాలెంలో పర్యటించారు. అక్కడ కిడ్నీ రోగులతో మాట్లాడారు. వ్యాధి ప్రబలడానికి గల కారణాలను ఆరా తీశారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ సాయితో మాట్లాడుతూ తక్షణమే రెండు గ్రామాల్లోనూ నీటి పరీక్షలను నిర్వహించాలన్నారు. సమస్యను కలెక్టర్ దినేష్‌కుమార్ దృష్టిలో ఉంచి ఆయా గ్రామాల్లో ఆర్‌వో నీటి ప్లాంట్‌ల ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదిస్తామన్నారు.

కల్తీ సరకుల విక్రయాలపై ఫిర్యాదు



తహసీల్దార్ వేణుగోపాల్‌కు పత్రాన్ని ఇస్తున్న ఫుడ్ విజిలెన్స్ కమిటీ సభ్యులు

వై.రామవరం: మండలంలో జిల్లా వినియోగదారుల సమైఖ్య కమిటీ ఆధ్వర్యంలో మండల ఫుడ్ విజిలెన్స్ కమిటీ నేతలు బుధవారం తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని నిత్యావసర వస్తువుల నాణ్యతను పరిశీలించారు. దుకాణాల్లో కల్తీ, కాలం చెల్లిన వస్తువులను విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఆయా వివరాలతో కూడిన పత్రాన్ని తహసీల్దార్ పి.వేణుగోపాల్‌కు అందజేశారు. కల్తీ వస్తువుల విక్రయాలు జరగకుండా చూడాలని కోరారు విజయ భాస్కరరెడ్డి, వీరరెడ్డి, ఉమాదేవి, జయశ్రీ, నాగమణి, పశువైద్యాధికారి వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ప్రజాప్రతినిధులకు శిక్షణ



అరకులోయ ఎంపీడీవో లవరాజు



అనంతగిరి ఎంపీడీవో కుమార్

అరకులోయటౌన్: గ్రామాల్లో సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై ఈనెల 12, 13 తేదీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో అడపా లవరాజు చెప్పారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని పెదలబుడు-1, పద్మాపురం-1, మాడగడ-1, గన్నెల, మాదల పంచాయతీల కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి ఆయా తేదీల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. శిక్షణకు హాజరయ్యే వారంతా ఆధార్ కార్డును మొబైల్ నంబర్‌తో అనుసంధానం చేయించుకు రావాలన్నారు. ఈ శిక్షణకు ప్రతి ఒక్కరూ విధిగా హాజరుకావాలని ఎంపీడీవో లవరాజు తెలిపారు.

అనంతగిరి(అరకులోయటౌన్): మండలంలోని ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహించనున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో కుమార్ చెప్పారు. తాగునీరు కొరత లేని గ్రామం, పచ్చదనం పరిశుభ్రత, స్వయం సమృద్ధి, మౌలిక సదుపాయాలు, సామాజిక భద్రత, సుపరిపాలన, మహిళ స్నేహపూర్వక సమాజం అనే అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. ఇందులో భాగంగా మొదటి విడతలో మండలంలోని అనంతగిరి, వేంగడ, ఎగువశోభ, బొర్రా, టోకూరు, కొండిబా, పైనంపాడు, లంగుపర్తి, వాలసీ, గుమ్మ, పెదబిడ్డ, కోనాపురం పంచాయతీల కార్యదర్శులు, సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తామని, అందరూ హాజరుకావాలని ఎంపీడీవో కుమార్ తెలిపారు.

రంపచోడవరం: ప్రభుత్వ కార్యక్రమాలు లబ్ధిదారులకు సక్రమంగా అందేందుకు మండల స్థాయి అధికారుల, సిబ్బంది పనిచేయాలని ఎంపీడీవో సుండం శ్రీనివాసుదొర అన్నారు. తన కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

సమావేశంలో ఇంటింటి సర్వే, బ్యాంక్ ఖాతాలు ఆధార్ లింక్, పాఠశాలలు తనిఖీ, పీసా గ్రామ లసభలు తదితర శిక్షణ కార్యక్రమాలు గురించి సమీక్ష నిర్వహించారు. ఏఓ పి.జయంతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

పాడేరు రూరల్,(అరకులోయ రూరల్): గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను ఈనెల 13వ తేదీ నుంచి నిర్వహించనున్నట్టు తహసీల్దార్ త్రినాథరావు తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 26 పంచాయతీల్లో సదస్సులు జరుగుతాయన్నారు. సదస్సులను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చింతపల్లి: మండలంలో రెవెన్యూ సదుస్సులను ఈ నెల 13 నుంచి నిర్వహిస్తున్న గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ రాజ్‌కుమార్ తెలిపారు.ఈ నెల 13 నుంచి జనవరి 10 వరకు జరగనున్న సదస్సుల్లో గిరిజనులు, రైతులు తమకు సంబంధంచిన రెవెన్యూపరమైన సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. సదస్సులలో వచ్చిన దరఖాస్తులను రిజిస్ట్రేషన్ చేసి, వాటి పరిష్కారానికి సంబంధించిన వివరాలను అర్జీదారులకు ముందుగా తెలియజేస్తామన్నారు.

గంగవరం: మండలంలోని శుక్రవారం నుంచి నిర్వహించనున్న రెవెన్యూ సదస్సులను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు చెప్పారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో గల అన్నీ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్టు తెలిపారు. గ్రామస్తులతో పాటు ప్రజాప్రతినిధులు గ్రామ సభలకు హాజరు కావాలని ఆయన కోరారు.

రంపచోడవరం జిల్లా ఏర్పాటు చేయాలి



దీక్షా శిబిరం వద్ద మాట్లాడుతున్న నాయకుడు దూలయ్య

చింతూరు: ఈ ప్రాంత ఆదివాసీల సౌలభ్యం కోసం రంపచోడవరం కేంద్రంగా ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని ఆదివాసీ ఉద్యోగ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకుడు మడకం దూలయ్య డిమాండ్ చేశారు. స్థానిక ఐటీడీఏ ఎదుట ఆదివాసీ నిరుద్యోగులు చేపట్టిన రెండోరోజు నిరాహార దీక్షలో భాగంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత జిల్లా కేంద్రమైన పాడేరు ఈ ప్రాంత వాసులకు ఎంతో దూరాభారంగా మారడంతో ఆదివాసీలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. రంపచోడవరం, చింతూరు డివిజన్లోని 11 మండలాలతో పాటు పోలవరం అసెంబ్లీ పరిధిలోని మండలాలను కలిపి రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఆదివాసీ యువత ఉద్యోగ భద్రత కోసం ప్రత్యేక ఉద్యోగ నియామక చట్టాన్ని రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు చినవీరభద్రం, వీరయ్య, రాఘవయ్య, ప్రసాద్, ముత్తయ్య, రమేష్, బాయమ్మ, సత్యవతి పాల్గొన్నారు.

వైభవంగా ఆలయం ప్రారంభం



కోలాటమాడుతున్న మహిళలు

పాడేరు రూరల్(అరకులోయ రూరల్): మండలంలోని పి.గొందురులో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్మించిన దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు అన్న సమారాధన జరిగింది. వివిధ గ్రామల నుంచి వచ్చిన భక్తులు థింసా నృత్యాలు, కోలాటలు చేసి అలరించారు. ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమంలో స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గీతా జయంతి వేడుకలు



పాఠశాల ఆవరణలో హోమంలో పాల్గొన్న భక్తులు

పాడేరు రూరల్(అరకులోయ రూరల్): మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో బుధవారం గీతా జయంతి వేడుకలను నిర్వహించారు. పాఠశాల అవరణలో హోమం నిర్వహించి విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు , పారాయణం చేయించారు. అనంతరం పాఠశాల నిర్వహకులుమాట్లాడుతు విద్యార్థులకు ఆధ్యాత్మిక భావన అలవర్చించేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బాబూరావు, సూర్యనారాయణ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పశుగణనపై సర్వే

చింతపల్లి: చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలోని చింతపల్లి, గూడెంకొత్తవీధి, కొయ్యూరు మండలాల్లో పశువుల గణనపై సర్వేను వేగవంతం చేసినట్టు చింతపల్లి పశుసంవవర్థకశాఖ ఏడీ చంద్రశేఖరరావు తెలిపారు. మూడు మండలాల్లోనూ సమారు 554 గ్రామాల్లో ఈసర్వే జరుగుతుందన్నారు.

13న ‘అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ’



జీకే వీధి జెడ్పీటీసీ కిముడు శివరత్నం



కొయ్యూరు ఎంపీపీ రమేష్

గూడెంకొత్తవీధి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 13న పాడేరులో చేపట్టనున్న ‘అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని గూడెం కొత్తవీధి జెడ్పీటీసీ సభ్యురాలు కిముడు శివరత్నం, కొయ్యూరు ఎంపీపీ బడుగు రమేష్ పిలుపునిచ్చారు. వారు ఆయా ప్రాంతాల్లో వేర్వేర్వుగా విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతుల పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. రైతులకు పెట్టుబడి సాయం నేటి వరకు ప్రకటించలేదని, పంటలకు గిట్టుబాటు ధరలు రావడం లేదన్నారు. తడిసిన ధాన్యం కొనుగోలుతో పాటు ఉచిత పంటల బీమాను అమలు చేయడం వరకు ఎలాంటి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేదన్నారు.ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వైఎస్సార్‌సీపీ అన్నదాతకు అండగా నిలిచి, కూటమి ప్రభుత్వ తీరుపై ఆందోళన కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఇందులో భాగంగా అల్లూరి జిల్లా కేంద్రంలో చేపట్టనున్న అన్నదాతకు అండగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమానికి భారీ ఎత్తున గిరిజన రైతులు, అన్ని వర్గాల గిరిజనులు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. పార్టీ పిలుపుమేరకు పాడేరులో నిర్వహించే కార్యక్రమంకు అంతా హాజరు కావాలన్నారు.

సేవతోనే సంపూర్ణ ఆనందం



ఆస్పత్రికి ఫర్నిచర్‌ను అందజేస్తున్న దాత స్టీఫెన్‌పాల్

రంపచోడవరం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి, సర్కారు బడికి ఓ స్వచ్ఛంద సంస్థ ఫర్నీచర్ ఇతరత్రా సామగ్రిని వితరణ చేసింది. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి రూ.15లక్షల విలువ చేసే ఫర్నీచర్, అదే విధంగా స్థానిక గిరిజన సంక్షేమ పాఠశాలకు రూ.7లక్షల విలువైన ఫర్నీచర్‌తో పాటు ఇతరత్రా సామగ్రిని పి.జె.ఎస్.పాల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, అంతర్జాతీయ సువార్తికులు డాక్టర్ పి.జె.స్టీఫెన్‌పాల్ బుధవారం అందజేశారు.రోగులకు, నిరుపేదలకు నిత్యావసర సరకులు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బోర్నగూడెం గ్రామంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొని 500 మంది పాస్టర్లకు దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవతోనే సంపూర్ణ ఆనందం కలుగుతుందన్నారు. ఏజెన్సీలోని అన్ని ప్రాంతాల్లో తమ సంస్థ తరఫున సేవలను విస్తృతం చేస్తున్నట్టు చెప్పారు. మండలంలో వివిధ చర్చిలను సందర్శించి ఆర్థిక సాయం చేశారు. బ్రదర్ ప్రవీణ్, సోజు ప్రకాష్, కిషోర్, జాన్, డాక్టర్ రోహిణి, డాక్టర్ ముఖర్జీ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి



బూడితపాడులో బోరు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపీపీ అనూషదేవి, జెట్పీటీసీ బాలయ్యపడాల్

చింతపల్లి: మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీపీ కోరాబు అనూష దేవి, జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య పడాల్ అన్నారు. మండలంలోని తాజంగి పంచాయతీ పరిధిలోని బూడిదపాడు గ్రామంలో తాగునీటి బోరు ఏర్పాటు పనులను వారు బుధవారం ప్రారంభించారు. తాగునీటి సమస్య లేకుండా జెడ్పీ నిధులతో 16 బోర్లను, మండల పరిషత్ నిధులతో 10 బోరుల ఏర్పాటుకు నిధులు మంజూరైనట్టు చెప్పారు. రానున్న రోజుల్లో మండలంలోని అన్ని బోరు నిర్మాణ పనులు పూర్తి చేసి, తాగునీటి సమస్య లేకుండా చేస్తామన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు జయలక్ష్మి, వైస్ సర్పంచ్ రవి తదితరులు పాల్గొన్నారు.


కిశోరి వికాసంపై శిక్షణ రేపు

ఎటపాక: ఎటపాకలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో కిశోరి వికాసంలో భాగంగా మండల స్థాయి శిక్షణ కార్యక్రమం ఈనెల 13న నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో విజయగౌరి తెలిపారు. ఉదయం 9.30 నుంచి 4.30 గంటల వరకు శిక్షణ గ్రామ స్థాయిలోని అధికారులకు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అందరూ హాజరు కావాలని కోరారు.

ప్రజా సేవలకు ప్రాధాన్యం

పాడేరు రూరల్(అరకులోయ రూరల్): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన నమో ఆప్‌లో తనకు గుర్తింపు లభించిట్టు బీజేపీ జిల్లా కార్యదర్శి సల్ల రామకృష్ణ చెప్పారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రజా సేవలకు ప్రాధాన్యమిస్తామన్నారు. పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తానన్నారు. ఉమామహేశ్వరరావు, సింహాచలం, రాజారావు, కళ్యాణం, కొండబాబు, గోపాలపాత్రుడు తదితరులున్నారు.

సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు




కుమిడిపుట్టులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో శ్రీనివాసబాబు

ముంచంగిపుట్టు: గిరిజన రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి పెట్టాలని మండల వ్యవసాయశాఖాధికారి ఎం.శ్రీనివాసబాబు అన్నారు. మండలంలోని కించాయిపుట్టు పంచాయతీ కుమిడిపుట్టు గ్రామంలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. గోమూత్రము, పేడ, వేప ఆకులతో జీవామృతం తయారీని వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖాధికారి శ్రీనివాసబాబు మాట్లాడుతూ సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. వ్యవసాయ, ప్రకృతి వ్యవసాయ శాఖల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని దేవరమడుగులు గ్రామంలో బుధవారం వ్యవసాయశాఖ ఏఓ ఉషారాణి ఆధ్వర్యంలో రైతులకు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సేంద్రియ ఎరువులు, జీవామృతం తయారీను రైతులకు వివరించారు. వీటి వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. పశువైద్యాధికారి వీరేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



ధాన్యం తరలిస్తున్న వాహనాన్ని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఏడీఏ చౌదరి

రంపచోడవరం: ఏజెన్సీలోని రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ కె.విశ్వనాథ చౌదరి అన్నారు. మండలంలోని బందపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. రైతుల నుంచి ధాన్యాన్ని రైస్ మిల్లుకు తీసువెళ్లే వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు దళారుల మాట నమ్మి మోసపోవద్దన్నారు. వ్యవసాయ సిబ్బంది, పీఏసీఎస్ సిబ్బంది రైతుల కల్లాల వద్దకు వెళ్లి గోనె సంచులు ఉచితంగా ఇచ్చి, అక్కడికే వాహనాలను పంపించి ధాన్యం సేకరణ చేస్తారన్నారు. ఏఓ లక్ష్మణరావు, విలేజ్ అగ్రి అసిస్టెంట్ శివరామకృష్ణ రైతులు పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని చవిటిదిబ్బలు ఆర్‌బీకేలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏవో ఉషారాణి అధ్యక్షతన ఏడీఏ సావిత్రి, పీఏఓ రాంబాబు, తహసీల్దార్ పి.వేణుగోపాల్, పశువైద్యాధికారి వీరేంద్ర తదితరులు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చవిటిదిబ్బలు, వై.రామవరం, చింతలపూడి, గుర్తేడు గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు.